## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

నీలగిరి, సెప్టెంబర్ 18 : జిల్లాలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నందున ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం పలు కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రామ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి, సెప్టెంబర్ 18 : మండలంలోని చిప్పలపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బత్తిని రమేశ్ తండ్రి నర్సింహ అనారోగ్యంతో మృతి చెం దాడు. జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నరేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే సామేల్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, సెప్టెంబర్ 18 : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని గురజాల గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నాయకులు చామల వెంకటరమణారెడ్డి, గూని వెంకటయ్య, నసుబోతుల అంజయ్య, చంద్రశేఖర్, కోక సాయికుమార్, ఎర్ర సుధాకర్, బొడ్డు సోమలింగయ్య, పడాల రమేశ్, పాకాల సతీశ్, పెరుమాండ్ల నరేశ్ పాల్గొన్నారు.

## స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి : డీఆర్‌డీఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబర్ 18: స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత, పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించాలని, బహిరంగ ప్రదేశాల్లో మల,మూత్ర విసర్జన చేయకూడదని సూచించారు. అంతకు ముందు మండలంలోని అల్వాల గ్రామ పంచాయతీలో సంపద వనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ భిక్షంరాజు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## మరో మూడు రోజుల్లో ఎస్ఎల్‌బీసీ హైలెవల్ కెనాల్‌కు నీటి విడుదల పెంపు : ఐబీ ఎస్ఈ

నల్లగొండ, సెప్టెంబర్ 18: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఏఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ హైలెవల్ కెనాల్‌కు మరో మూడు రోజుల్లో నీటి విడుదల పెంచనున్నట్లు ఐబీ ఎస్ఈ అజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగవ పంపు మరమ్మతులు పూర్తయిన నేపథ్యంలో నాగార్జునసాగర్ ద్వారా హైలెవల్ కెనాల్‌కు పూర్తి స్థాయిలో నీటి విడుదల చేయనున్నందున ఇక అన్ని కాల్వల్లోకి సమృద్ధిగా నీరు రానున్నదని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని మొదట ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులకు సాగు నీరు విడుదల చేసి తర్వాత చెరువులను నింపుతామని తెలిపారు.

## పౌష్టికాహారంపై అవగాహన

చండూరు : మండలంలోని బోడంగిపర్తి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం. సుజాత పలు అంశాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు షబాన, వనజాత, ఏఎన్ఎం శ్రీలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● కలెక్టర్ నారాయణరెడ్డికి రైతుసంఘం నాయకుల వినతి

నల్లగొండ, సెప్టెంబర్ 18 : పత్తి, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, బండ శ్రీశైలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తాము పండించిన పత్తితో పాటు ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొస్తున్నందున కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరారు. లేని పక్షంలో వారు దళారులకు ఆశ్రయించి నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల పక్షాన ఆలోచించి పత్తి క్వింటాకు రూ.12,500, వరి ధాన్యం క్వింటాకు రూ.2,850తో పాటు వెయ్యి రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, అయిత రాజు నర్సింహ, సాగర్ల మల్లేశ్, చాపల మారయ్య, కుంభం కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.






## సీఎంఆర్‌ను ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలి

● డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు



రామ్ లక్ష్మణ్ రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నల్లగొండ, సెప్టెంబర్ 18: గత వానకాలానికి సంబంధించిన సీఎంఆర్‌ను ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు ఎస్‌డబ్ల్యూసీ గోదామ్ మేనేజర్‌కు సూచించారు. బుధవారం ఆర్జాలబావిలోని ఎస్‌డబ్ల్యూసీ గోదామ్‌ను ఆయన సందర్శించారు. గోదామ్‌లో ఎంత ఖాళీ స్థలం ఉంది.. సీఎంఆర్ రైస్ దిగుమతి ప్రక్రియ ఎలా సాగుతుందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పానగల్‌లోని రామ్ లక్ష్మణ్ మిల్లును సందర్శించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ డెలివరీలో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు.

### జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

2024-25 వానకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు తెలిపారు. బుధవారం ధాన్యం కొనుగోళ్లకు చేపడుతున్న ఏర్పాట్లపై బుధవారం అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, డీఎస్‌ఓలు, సివిల్ సప్లై డీఎంలతో పాటు ఇతర శాఖల అధికారులతో బుధవారం కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ నుంచి పాల్గొన్న డీఎస్‌ఓ మాట్లాడుతూ వానకాలం సీజన్‌కు సంబంధించి మొత్తం 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కానుండగా అందులో 7.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రెండు మూడు రోజుల్లో సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సివిల్ సప్లై డీఎం హరీశ్, డీఏఓ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

● తాసీల్దార్ కృష్ణయ్య



ముకుందాపురంలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తాసీల్దార్ జంగాల కృష్ణయ్య

నిడమనూరు, సెప్టెంబర్ 18 : ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ కృష్ణయ్య హెచ్చరించారు. మండలంలోని ముకుందాపురం, బొక్కమంతలపహాడ్, నిడమనూరు గ్రామాల శివారులోని ప్రభుత్వ, ఎస్ఎస్పీ భూములు ఆక్రమణకు గురయ్యాయని స్థానికులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తాసీల్దార్ ఆయా భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముకుందాపురంలోని సర్వే నం.840లో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. ఎస్ఎస్పీ, ప్రభుత్వ భూముల ఆక్రమణ దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట గిర్దావర్ శశికుమార్, సర్వేయర్ విజయ్‌కుమార్ ఉన్నారు.

## చిరుధాన్యాలతో రక్తహీనత దూరం : సీడీపీఓ



మాట్లాడుతున్న సీడీపీఓ ఉదయశ్రీ

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబర్18: చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా రక్తహీనతకు దూరంగా ఉండొచ్చని సీడీపీఓ ఉదయశ్రీ అన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరిత, ఏసీడీపీఓ సువర్ణ, సూపర్‌వైజర్ యాదమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## రెండు క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

నందికొండ, సెప్టెంబర్ 18 : నాగార్జునసాగర్ డ్యాంకు బుధవారం శ్రీశైలం నుంచి 70,926 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో ప్రాజెక్టు రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 24,884 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులకు గాను 589.90(311.7462 టీఎంసీ) అడుగుల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వ ద్వారా 4613 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 10వేలు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,029, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 70,926 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది.

## అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు

మర్రిగూడ,సెప్టెంబర్ 18 : శివన్నగూడెం ప్రాజెక్టు నిర్మాణ పనులను అడ్డం పెట్టుకొని కొంత మంది అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల లింగస్వామి బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాంరెడ్డిపల్లి సమీపంలోని పోతుగొండ నర్సింహస్వామి గుట్టల్లో రాత్రి సమయంలో బ్లాస్టింగ్ నిర్వహించి రాళ్లను, మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు.

## పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక



పీఆర్‌టీయూ కొత్త కార్యవర్గం

మునుగోడు, సెప్టెంబర్18 : పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ యూసుఫ్ పాషా, ప్రధాన కార్యదర్శిగా అన్నెపురెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా డి.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గాలి శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా సునీత, కార్యదర్శులుగా గొడ్డేటి నర్సింహ, రాధ ఎన్నికయ్యారు.

## బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ



బీఆర్‌ఎస్ నాయకుడు వీరయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజసింహారెడ్డి

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబర్18 : మండలంలోని కాల్వపల్లి గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు చెన్నబోయిన వీరయ్య తల్లి నరసమ్మ బుధవారం మృతి చెందారు. ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి గ్రామానికి వెళ్లి నరసమ్మ మృదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిట్టిబాబునాయక్, డైరెక్టర్ జట్టి లింగయ్యాయాదవ్, మాజీ సర్పంచ్ రామరాజు, మాజీ ఎంపీటీసీ తలకొప్పుల సైదులు ఉన్నారు.

## పారిశుధ్య కార్మికురాలిపై యువకుడి లైంగిక దాడి

నీలగిరి, సెప్టెంబర్ 18 : నల్లగొండ పట్టణంలోని హిందూపూర్ నీళ్ల ట్యాంకు సమీపంలో ఉన్న శ్మశాన వాటిక వద్ద పని చేస్తున్న పారిశుధ్య కార్మికురాలిపై బుధవారం యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న మహిళ(60) తనవిధులు నిర్వహించేందుకు తన ఇంటి నుంచి రామగిరికి వెళ్తుండగా శ్మశాన వాటిక వద్దకు చేరుకోగానే ఆమె నివాసముండే ప్రాంతానికి చెందిన యువకుడు కందుల కృష్ణ ఆమెను వెంబడించి పట్టుకొని బలవంతంగా శ్మశానవాటికలోకి లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తీవ్రమైన రక్తస్రావంలో బాధపడుతున్న వృద్ధురాలు స్థానికుల సాయంతో ఇంటికి చేరుకుంది. అనంతరం తన కుతూరుతో కలిసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి ఆమెను ఆస్పత్రికి తరలించారు. నిందితుడు కృష్ణను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు, అతడిపై ఇప్పటికే పలు కేసులున్నట్లు సీఐ తెలిపారు.

## చింతపల్లి తాసీల్దార్‌గా రమాకాంత్‌శర్మ

మాల్,సెప్టెంబర్ 18: చింతపల్లి తాసీల్దార్‌గా కె.రమాకాంత్ శర్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. యాదాద్రిజిల్లాలో సివిల్ సప్లై అధికారిగా పని చేసిన ఆయన పదోన్నతిపై చింతపల్లికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన తాసీల్దార్ విజయ్‌కుమార్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

## తెలంగాణ ఉద్యమకారుడు లింగారెడ్డికి పలువురి నివాళి

నకిరేకల్, సెప్టెంబర్ 18 : తెలంగాణ ఉద్యమకారుడు యానాల లింగారెడ్డి సంస్మరణ సభను బుధవారం నకిరేకల్ పట్టణంలోని లక్ష్మీసుజాత ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా లింగారెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే వేముల వీరేశం, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్యతో పాటు పలువురు నాయకులు నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో లింగారెడ్డి నిర్వహించిన పాత్రను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, నాయకులు నకిరేకంటి ఏసుపాదం, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాపై నేడు అఖిలపక్ష సమావేశం

నార్కట్‌పల్లి, సెప్టెంబర్ 18 : గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితా రూపొందించేందుకు గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలుపాలని ఆయన సూచించారు.

## విద్యార్థుల్లో భాషా నైపుణ్యాన్ని పెంపొందించాలి

● నోడల్ అధికారి సైదానాయక్

చిట్యాల, సెప్టెంబర్ 18 : విద్యార్థుల్లో భాషా నైపుణ్యాన్ని పెంపొందించాలని మండల నోడల్ అధికారి సైదానాయక్ సూచించారు. బుధవారం చిట్యాలలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల అభ్యసన ప్రక్రియను పరిశీలించారు. విద్యార్థులతో చదివించి, రాత పుస్తకాలను, అభ్యాసన దీపికను పరిశీలించారు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు అంబటి సత్తయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

## పామనుగుండ్ల మాజీ సర్పంచ్ లింగయ్య మృతి

కట్టంగూర్, సెప్టెంబర్ 18 : మండలంలోని పామనుగుండ్ల మాజీ సర్పంచ్ కర్నాటి లింగయ్యగౌడ్ అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. 2001లో సీపీఎం మద్దతుతో గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. లింగయ్య మృతికి మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, మాజీ ఎంపీపీ కొండ లింగస్వామి, గ్రామ మాజీ సర్పంచ్ వడ్డె సైదిరెడ్డి, చెరుకు నర్సింహ సంతాపం తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

నిడమనూరు, సెప్టెంబర్ 18 : మండలంలోని పార్వతీపురం గ్రామానికి చెందిన బలుసు సూర్యకాంతానికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.26 వేల చెక్కును బుధవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంకతి సత్యం అందించారు. సూర్యకాంతం ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందగా సాగర్ ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయనిధి మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, నాయకులు ఉన్నారు.

## అదుపుతప్పి బారికెడ్లను ఢీకొన్న కారు

● ఒకరికి గాయాలు

నిడమనూరు, సెప్టెంబర్ 18 : మిర్యాలగూడ నుంచి హాలియా వైపునకు వస్తున్న హ్యుందాయ్ కారు నిడమనూరు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోని మూలమలుపు వద్ద అదుపుతప్పి డివైడర్ మీదుగా దూసుకెళ్లి రోడ్డువెంట ఉన్న బారికెడ్లను ఢీకొట్టింది. దాంతో కారు నడుపుతున్న హాలియాలోని ఆదిత్య కేర్ దవాఖాన వైద్యుడు డాక్టర్ రవీందర్‌రెడ్డికి గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు.

## బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీస్ విషయంలో చట్టం తన పని చేస్తుంది

మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, సెప్టెంబర్ 18: నల్లగొండ బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీస్ కూల్చివేతపై చట్టం తన పని తాను చేసుకు పోతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడలోని పలు కార్యక్రమాల్లో ఆయన హాజరైన తర్వాత విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ పార్టీ ఆఫీస్ కూల్చాలని తాము కోర్టుకు వెల్లలేదని, ఆ పార్టీ వారే కోర్టుకు వెల్లడంతో కోర్టు కూల్చాలని తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. అయితే పార్టీ ఆఫీస్ కూల్చాలని పలు సందర్భాల్లో మున్సిపల్ అధికారులపై మంత్రి కోమటిరెడ్డి ఒత్తిడి తేవటంతో బీఆర్‌ఎస్ నేతలు కోర్టుకు వెళ్లారు. అయితే కోర్టు 15 రోజుల్లోగా ఆఫీసును కూల్చాలని ఆదేశాలు ఇవ్వటంతో స్పందించిన ఈ విధంగా స్పందించారు. నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి జోక్యం చేసుకొని తాము ఇన్నాళ్లు చెప్పిన విషయమే ఇవ్వాళ కోర్టు తేల్చిందని అన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబర్ 18: నాగార్జునసాగర్ నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 18 మందికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి మిర్యాలగూడలోని తన క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉన్నం సత్యనారాయణ, సంతోష్ రెడ్డి, పల్లేటి భిక్షం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు

● ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా, సెప్టెంబర్18 : గురువులే సమాజ నిర్దేశకులని నాగార్జునసాగర్ ఎమ్మె ల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం హాలియాలోని లక్ష్మీనర్సింహ గార్డెన్‌లో విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుదే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించడంతో పాటు పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నదని పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ యడవల్లి అనుపమా నరేందర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి రాజ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, నాయకులు కాకునూరి నారాయణ, తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, ధన్‌సింగ్‌నాయక్, చింతల చంద్రారెడ్డి, గౌని రాజారమేశ్‌యాదవ్, కుందూరు వెంకట్‌రెడ్డి, వెంపటి శ్రీనివాస్ ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కట్టంగూర్, సెప్టెంబర్ 18 : స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం అశ్రితా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహలు, బాలకార్మిక వ్యవస్థ, మాదక ద్రవ్యాల నిర్మూలన, బాలికలపై వేధింపులపై అవగాహన కల్పించారు. సంస్థ కోఆర్డినేటర్ శోభారాణి మాట్లాడుతూ బాలికలకు సమాజంలో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు సంస్థ తరుపున కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అంబటి అంజయ్య ఝూన్సీ, చినరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 20న ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను సందర్శించున్న మంత్రులు



ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

చందంపేట, సెప్టెంబర్ 18 : చందంపేట మండలంలోని మన్నెవారిపల్లి వద్ద జరుగుతున్న ఎస్ఎల్‌బీసీ టన్నెల్-1 సొరంగం పనులను పరిశీలించేందుకు ఈ నెల 20న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందర్శించనున్నారు. మంత్రుల రాక నేపథ్యంలో ఏర్పాట్లను బుధవారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌తో పాటు ఇరిగేషన్‌శాఖ అధికారులు, అడిషనల్ ఎస్పీ పరిశీలించారు. హెలిప్యాడ్‌ను పరిశీలించారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో పోలీసుశాఖ బందోబస్తు చేపట్టింది. ఇప్పటికే టన్నెల్ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీరాములు, అడిషనల్ ఎస్పీ రాములునాయక్, ఇరిగేషన్‌శాఖ సీఈ అజయ్‌కుమార్, తాసీల్దార్ శ్రీనివాస్, డీఎస్పీ గిరిబాబు, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, శ్రీధర్, డీఈలు చక్రపాణి, శ్రీను, ఏఈలు పాల్గొన్నారు.

## రూ.2.6లక్షలు పలికిన వినాయక లడ్డూ



రూ.2లక్షలకు లడ్డూ వేలం దక్కించుకున్న మన్నయ్య

చందంపేట, సెప్టెంబర్ 18 : మండలంలోని ముడుదండ్ల గ్రామంలో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద బుధవారం నిర్వహించిన లడ్డూ వేలంపాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన జక్కుల మున్నయ్యయాదవ్ రూ.2,06,116కు పాడి లడ్డూను దక్కించుకున్నారు.

### పెద్దవూరలో రూ.1.16 లక్షలు

పెద్దవూర : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బట్టుగూడెం గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద బుధవారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ శ్రీనివాస్‌రెడ్డి, పద్మ దంపతులు రూ.1.16లక్షలకు పాడి లడ్డూను దక్కించుకున్నారు.

నిడమనూరు : మండలంలోని ఊట్కూరు గ్రామంలో శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంపాటలో గ్రామానికి చెందిన మద్దెల నగేశ్ రూ.53,116కు లడ్డూ దక్కించుకున్నారు.

## చికిత్స పొందుతూ రెస్టారెంట్ యజమాని మృతి

నీలగిరి, సెప్టెంబర్ 28 : నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్‌రోడ్డులోని వివేకానంద విగ్రహం వద్ద గల పరమేశ్వర రెస్టారెంట్ యజమాని జాపట్నం ప్రవీణ్(35) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌కు చెందిన ప్రవీణ్ భార్య సౌమ్య నల్లగొండ మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. దాంతో నాలుగు సంవత్సరాల క్రితం నల్లగొండకు వచ్చి పద్మనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసముంటున్నారు. కొన్ని లావాదేవీల విషయంలో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రవీణ్ ఈ నెల 12న గడ్డిమందు తాగాడు. దాంతో చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.